

గిరిరాజ్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ల్యాబ్ ఏర్పాటు కోసం ఆర్థిక సహాయంతో పాటు ఫర్నిచర్‌ను అందజేసిన గుత్ప భూమారెడ్డి చేత ప్రారంభించారు. తాను చదువుకున్న కళాశాలకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో ల్యాబ్ ఏర్పాటుకు సహాయం చేశానని గుత్ప భూమారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫిక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభల్లో గందరగోళం!

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు, వార్డు సభలు జిల్లాలో పలు చోట్ల గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. ఆయా పథకాల్లో అర్హత ఉన్నా.. జాబితాలో తమ పేర్లను చేర్చలేదని పలువురు దరఖాస్తుదారులు ఆందోళన చేపడుతున్నారు. అధికారులను నిలదీస్తున్నారు. పలువురు ప్రశ్నిస్తున్నారు.



నవీపేట గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

- నిరసనలు, నిలదీతల మధ్య కొనసాగుతున్న సభలు
- జాబితాలో అర్హుల పేర్లు లేవని దరఖాస్తుదారుల ఆందోళన
- అర్హులను ఎంపిక చేయలేదని అధికారులను నిలదీస్తున్న ప్రజలు
- జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు, విజ్ఞప్తులు
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం అధిక దరఖాస్తులు

నిజామాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గ్రామసభలు, వార్డు సభల్లో ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. నాలుగు పథకాలలో రైతుభరోసా మినహాయించి ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులపైనే ప్రజల నుంచి ఫిర్యాదులు, నిలదీతలు కొనసాగుతున్నాయి. అర్హులైన వారికి రాలేవని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఫిర్యాదు చేస్తున్నారు. అన్ని ఉన్న వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. తమకు కార్డులు మంజూరు చేయాలని ఇళ్లను ఇవ్వాలని దరఖాస్తు చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇళ్ల కోసం, కార్డుల కోసం ఎదురు చూశామని వచ్చిన జాబితాలో తమ పేర్లు లేవని తమకు అవకాశం ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 177చోట్ల సభలు

జిల్లాలో నాలుగు పథకాల కోసం నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలు మూడో రోజు గురువారం కొనసాగాయి. జిల్లాలోని 137 గ్రామాలు, 40 మున్సిపల్ వార్డులలో ఈ సభలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 177చోట్ల సభలు నిర్వహించారు. ఈ సభలకు మూడు రోజులుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మూడో రోజు కూడా పలు మండలాల పరిధిలో సమస్యలపై అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు మంజూరు చేయలేదని ఆరోపించారు. చందూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఆహార భద్రత కార్డుల్లో అర్హులకు చోటు దక్కలేదని ఆరోపించారు. వేల్పూర్ మండలం జాన్కంపేటలో ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం సభలో గందరగోళం ఏర్పడింది. అధికారులను గ్రామస్థులు నిలదీస్తుండగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని సభ సజావుగా జరిగే విధంగా చూశారు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ఇందిరమ్మ అర్హుల ఎంపిక, రేషన్ కార్డుల విషయమై అధికారులను నిలదీశారు. బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులోనూ కార్డులపై అధికారులను నిలదీశారు. అర్హులైన వారికి ఇవ్వలేదని ఆరోపించారు. అర్హులను పట్టించుకోకుండా అనర్హులకు ఇళ్లను మంజూరు చేశారని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా కోసం ఎక్కువ సంఖ్యలో అధికారులను అడగడంతో పాటు తమకు రాలేదని ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన గ్రామసభల్లో భారీగా దరఖాస్తులు వస్తుండటంతో ఆయా మండలాల్లో సభలు నిర్వహిస్తున్న అధికారులు వాటన్నింటినీ స్వీకరిస్తున్నారు. జిల్లాలో మూడు రోజుల పాటు సభ నిర్వహించిన అధికారులు చివరి రోజు సభను పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ మూడు రోజుల్లో ఇప్పటి వరకు 456 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు, 120 వార్డులలో వార్డు సభలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు భారీగా దరఖాస్తులను చేశారు. రైతుభరోసా కోసం 977 మంది, ఆహార భద్రత కార్డుల కోసం 31,414మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 7,513 మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 15,291 మంది దరఖాస్తులు చేశారు. మూడో రోజు గురువారం కూడా భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నాలుగు రోజులలో ఈ దరఖాస్తులు లక్ష వరకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ సభలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జిల్లా అధికారులందరూ పాల్గొంటున్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు ఇతర అధికారులు ఈ గ్రామసభలను పర్యవేక్షిస్తూ సజావుగా జరిగే విధంగా పర్యవేక్షిస్తున్నారు.

ఘన్‌పూర్ గ్రామ సభలో రసాభాస..



అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న ఘన్‌పూర్ గ్రామస్థులు

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్‌లో గ్రామసభ రసాభాసగా జరిగింది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా ఎందుకు లేవని నిలదీశారు. దీంతో పోలీసులు కల్పించుకొని గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. జాబితాలో పేర్లు ఉన్న వారు ఆనందం వ్యక్తం చేస్తుంటే.. రానివారు వాగ్వాదానికి దిగుతున్నారు. అయితే అర్హులందరికీ పథకాలు అందుతాయని పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జాబితాలో అనర్హులు ఉంటే తొలగిస్తాం: డీపీవో

ధర్పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా ముగిసింది. అధికారులు గ్రామసభలో చదివి వినిపించిన జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. గ్రామసభకు వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ గ్రామస్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉంటే వాటిని తొలగించి అర్హులైన వారిని జాబితాలో చేర్చేందుకు అకాశం కల్పిస్తామన్నారు. జాబితాలో లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మిట్టపల్లి గంగారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీవో బాలకృష్ణ, ఈవో శ్రీనివాస్, ఆర్‌ఐ రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ధర్పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

మోపాల్: గ్రామసభల్లో అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపిస్తుండగా, ఇందులో అర్హుల పేర్లు లేకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ జాబితా ఇంకా ఫైనల్ కాలేదని అధికారులు వారికి నచ్చచెబుతున్నారు. మరికొందరు ఉచిత కరెంటు రావడం లేదని వివరిస్తున్నారు. మరికొందరు గ్యాస్ సిలిండర్ రూ.500లకు రావడం లేదని సభ దృష్టికి తెస్తున్నారు. ఎవరైతే గ్రామసభలో సమస్యలపై గళం విప్పితున్నారో వారిని సభనుంచి పోలీసులు తొలగిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

గ్రామసభ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

బోధన్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల ద్వారా సేకరించిన వివరాలన వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. మండలంలోని బండారుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద అర్హులను గుర్తిస్తూ రూపొందించిన ముసాయిదా జాబితాను పరిశీలించి, గ్రామసభలో అడిగి తెలుసుకున్నారు. వివిధ పథకాల కోసం గ్రామసభలో కొత్తగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలని ఆదేశించారు.



బోధన్ మండలంలోని బండారుపల్లి గ్రామసభ వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

బాలుర గురుకుల పాఠశాల తనిఖీ

బోధన్ పట్టణ శివారులో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు. నాసిరకమైన బియ్యం, వంట నూనె, ఇతర సరుకులు సరఫరా చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్థానిక అధికారులు ఉన్నారు.



టీయూలో మౌలిక సదుపాయాలపై దృష్టి

- రూ.220 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- కొత్త ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు వినతి
- సమస్యల పరిష్కారానికి చర్యలు

నిజామాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి పెట్టారు. విశ్వవిద్యాలయం పరిధిలో భవనాల నిర్మాణంతో పాటు కొత్త కోర్సుల నిర్వహణ కోసం ప్రణాళికను సిద్ధం చేశారు. విశ్వవి ద్యాలయం పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం రూ.220 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటు చేయనున్నారు. విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో వెయ్యి సీట్ల కెపాసిటీతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టడంతో పాటు కొత్త అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణానికి కూడా ప్రణాళికలను సిద్ధం చేశారు. విద్యార్థుల కోసం కొత్త వసతిగృహాలను నిర్మించాలని ప్రతిపాదనల్లో పొందుపర్చారు.

గత నెలలో ప్రతిపాదనలు పంపిన అధికారులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనుల కోసం రూ.220 కోట్లతో ప్రతిపాదనలను రూపొందించారు. గత నెలలో జరిగిన ఉన్నత విద్యాశాఖ సమావేశంలో అధికారులకు ప్రతిపాదనలు అందించారు. విశ్వవిద్యాలయం పరిధిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేయాలని కోరారు. విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలలు ఎక్కువగా ఉండటం వల్ల పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేందుకు అదనపు భవనం అవసరం ఉండటంతో కొత్త అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు అందించారు. విశ్వవిద్యాలయం పరిధిలో బాలికల వసతి కోసం నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఆడిటోరియం నిర్మాణం చేపట్టాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలతో పాటు అన్ని కాన్ఫరెన్స్‌లకు ఈ భవనం ఉపయోగపడే విధంగా వెయ్యి సీట్లతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో కొత్తగా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించారు. విశ్వవిద్యాలయం పరిధిలో కొత్తగా సైన్స్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టి నందున ఇంజనీరింగ్ కళాశాల పాత భవనంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఫార్మస్యూటికల్ కెమిస్ట్రీ నిర్వహిస్తున్నందున ఆ విభాగం పరిధిలో ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగపడుతుందని ప్రతిపాదనల్లో పొందుపర్చారు. బీఫార్మసీతో పాటు ఎంఫార్మసీ కోర్సుల నిర్వహణకు అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులతో పాటు సీఎం దృష్టికి కూడా ఈ విషయమై తీసుకువెళ్లారు. విశ్వవిద్యాలయ పరిధిలో అభివృద్ధి పనుల కోసమే ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించినట్లు వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కోసం 220 కోట్లరూపాయల ప్రతిపాదనలు అందించామన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే
ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- సాగుకు యోగ్యమైన ప్రతీ భూమికి రైతు భరోసా 6
- జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా
- ఇద్దరు విద్యార్థులకు గాయాలు
- బస్సులో 30మంది విద్యార్థులు
- నవీపేట మండలం కమలాపూర్ సమీపంలో ఘటన 6



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్, పల్లె గంగారెడ్డి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసిన ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను గురువారం ఢిల్లీలో ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో పాటు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కల సహకారమైనందున పసుపు రైతుల సంక్షేమానికి తోడ్పడాలని మంత్రి కోరారు. అంతేకాకుండా పసుపు ఎగుమతులు, మార్కెటింగ్ తదితర అంశాలపై చర్చించారు. అతిత్వరగా పసుపు బోర్డు కార్యక్రమాలను మొదలు పెడతామని మంత్రి తెలిపారు. తనను పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు పల్లె గంగారెడ్డి కేంద్ర మంత్రిని సన్మానించారు. ఈ సమావేశంలో జగిత్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరేపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన స్పౌజ్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

- జిల్లాలో 57 మంది ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవో 317 కారణంగా ఇతర జిల్లాలకు వెళ్లిన స్పౌజ్ ఉపాధ్యాయులను ఇటీవల ప్రభుత్వం సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. స్పౌజ్ బదిలీలలో భాగంగా జిల్లాకు కేటాయించబడిన 57మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈవో అశోక్, ఏడీ నాగజ్యోతి, ఏసీ విజయ్‌భాస్కర్ తదితరులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 57మందికి స్పౌజ్ కేంద్రాలకు దగ్గరగా పాఠశాలలను కేటాయించారు. వారు శుక్రవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేయనున్నారు.

పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు సంక్షేమ పథకాలు

● రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


అడ్కాస్‌పల్లిలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం


జాన్కంపేట్ గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం


కోనాపూర్ గ్రామసభలో పాల్గొన్న మానాల మోహన్ రెడ్డి, అధికారులు

కోటగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, రైతు భరోసా సాగుకు యోగ్యమైన ప్రతి భూమికి అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామాలలో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజుతో కలిసి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. రైతు భరోసా సాగుకు యోగ్యమైన భూములకు అందించడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. జిల్లాలో ఐదున్నర లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, పలు నిబంధనల మేరకు 12 వేల ఎకరాల భూమికి మాత్రమే రైతు భరోసా అందించడం లేదన్నారు. రైతు భరోసా ఎకరానికి 6000 చొప్పున సంవత్సరానికి 12 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమవుతుందన్నారు. పెట్టుబడి సాయంతో పాటు బోనస్ కల్పించడంతో వ్యవసాయం పండగలాగా సాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారికి 5 లక్షల రూపాయలు ఎలాంటి కటింగులు లేకుండా మొత్తం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ హన్మంతు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, నాయకులు కొట్టం మనోహర్, సిరాజ్, బర్ల మధు, శ్రీధర్, కృష్ణారెడ్డి, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారులు రాజు, నిషిత, ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మోస్రా మండల కేంద్రంలో, చందూర్ మండల కేంద్రంలో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించగా మోస్రాలో రేషన్ పరేషాన్ కాగా చందూర్ మండల కేంద్రంలో గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుగా చేశారని, ఇళ్లు ఉన్న వారికి డబుల్ ఫ్లోర్ ఇళ్లు ఉన్న వారికి సైతం ఇళ్లు మంజూరు అయింది. కాని మా లాంటి ఇళ్లు లేని వారికి మంజూరు కాలేదని గ్రామస్థులు అధికారులను ప్రశ్నించగా అధికారులు అంతా గప్ చుప్‌గా ఉన్నారు. స్థానిక నాయకులు గ్రామస్థులను ఓపికగా ఉండాలని కోరుతూ వారు అధికారులను ప్రశ్నించారు. అదే విధంగా ఓ గ్రామ పెద్ద మాట్లాడుతూ నేను స్వయంగా రాసి ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తులో కూడా అర్హులైన వారిని అనర్హులుగా చూపించారు. ఇంతటి నిర్లక్ష్యం తగదని అన్నారు. ఉపాధి హామీ కూలీ డబ్బులు సైతం కొందరికీ రాలేదని ఆరోపణ చేశారు. అదే విధంగా చందూర్ మండలంలోని మేడిపల్లితండాలో తహసీల్దార్ శాంత ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించగా ఎలాంటి ఆరోపణలు ఏర్పడలేదు. ఈ కార్యక్రమంలో చందూర్ మండల అధికారి విజయ్ కుమార్, తహసీల్దార్ శాంత, ఎంపీడీఓ నీలావతి, మోస్రా మండల ప్రత్యేక అధికారి రమేష్ రాథోడ్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ సురేష్, ఆయామండలాల కార్యాలయాల సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు,గ్రామస్థులు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. నవీపేట, రాంపూర్, పొతంగల్, నందిగాం, నిజాంపూర్, నాడాపూర్, సిరన్‌పల్లి, శివతండా, యంచ, తుంగిని గ్రామాలలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల జాబితాలలో అర్హులైన వారి పేర్లు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలువురు అధికారులను నిలదీశారు. నవీపేటలో జరిగిన గ్రామసభలో అనర్హులకు రేషన్ కార్డులు ఎలా మంజూరయ్యాయని పలువురు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఏవో నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

ఏర్గట్ల: మండలంలోని దోంచంద, తొర్తి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలకై ఏర్పాటు చేసిన గ్రామ సభలు నిర్వహించారు. అందులో భాగంగా తొర్తి గ్రామంలో గురువారం జరిగిన గ్రామ సభ రసాభాసగా మారింది. గ్రామంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను అధికారులను గ్రామ సభలో తెలుపగా అనర్హుల పేర్లు రావడం, అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధిచిన కేవలం 81 మందికి మాత్రమే ఎలా వర్తిస్తుందని, మిగతా ఉపాధి కూలీల పేర్లు ఎందుకు రాలేదని స్థానికుల తరపున మాజీ సర్పంచ్‌నవీన్ అధికారును ప్రశ్నించడంతో ఆందోళన జరగ్గా ఏర్గట్ల ఎస్సై రాము రంగంలోకి దిగిగొడవను సర్దిమనిగించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీవో శివచరణ్,ఆర్ఐ సదానంద్, ఏవో వైష్ణవ్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఇది నిరంతర ప్రక్రియ అని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని 25 తదితర వార్డులలో ప్రజాపాలన వార్డుసభల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వార్డు సభలలో పేర్లు రాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ విఘ్నేష్‌లతో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సాలూర: బోధన్ మండలంలోని హున్స, మావందిఖుర్దు,పెంటాకలాన్, నాగన్‌పల్లి, భవానీపేట్ తదితర గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా రేషన్‌కార్డులు రాని వారు తమ పేర్లు నమోదు చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వార్డుసభలను గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని 6, 10, 14, 15, 21, 25, 27, 28, 34, 35 వార్డులలో వార్డుసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకులు కొంతం మురళీ, బదం రాజ్‌కుమార్, ఇంతియాజ్, అతిక్, సత్యనారాయణ, భూపేందర్, రవీంధర్‌రెడ్డి, విజయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: అర్హులైన నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని లబ్ధిదారుల జాబితాలో పేర్లు రానివారు అధైర్యపడకుండా తిరిగి దరకాస్తులు చేసుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ ఎం ఆంజనేయులు, ఆర్ఐ శరత్, నాయకులు చిన్నోల్ల రెడ్డి,జలందర్, గడ్డం అశోక్, లక్ష్మతి, హన్మాండ్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: జిల్లా పరిషత్ సీఈవోగా పదవీ బాధ్యతలు చేప ట్టిన సాయన్నను గురువారం ఆలూర్ గ్రామస్థులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. తమ గ్రామానికి చెందిన అధికారి సాయన్న జడ్పీసీఈ వోగా బాధ్యతలు చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ కల్లెం మోహన్‌రెడ్డి, మాజీఎంపీటీసీ మార్కంటి మల్లేష్, మాజీఉపసర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, ముత్యం పాల్గొన్నారు.

వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు నిర్వహణలో భాగంగా శుక్రవారం మండలంలోని జాన్కంపేట్, వాడి గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. జాన్కంపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల వంటి పథకాలకు మంజూరుకు సంబంధించి జాబితాను లబ్ధిదారులు చదివి వినిపించారు. దీంతో ఆయా పథకాలలో నిజమైన అర్హులైన వారికి కాకుండా అనార్హుల పేర్లు జాబితాలో ఉండడం పట్ల గ్రామ ప్రజలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు అధికారులను నిలదీయడంతో గ్రామసభ రసభసగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో మంజూరైన జాబితాలో అనార్హుల పేర్లు ఉండడం పట్ల ప్రజలు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి భారతి, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో సాయిలు, డీటీ మధు, ఏపీవో అశోక్, ఏఈవో స్నేహశ్రీ, గ్రామస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్/భీమ్‌గల్‌రూరల్: మండలంలోని పురాణీపేట్ గ్రామంలో గురువారం గ్రామసభలో గందరగోళం ఏర్పడింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇంది రమ్మ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళ జాబితా, రేషన్‌కార్డుల జాబితాలో అర్హుళకు కాకుండా అనర్హులకు పథకాలు ఇస్తున్నారని అధికారులను నిలదీసి రచ్చరచ్చ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఎంత సముదాయించిన వినకుండా అర్హత ఉండి జాబితాలో పేరు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించిన కొంత మంది వెనుదిరిగారు. జగిర్యాల్, కుప్కాల్, సుదర్శన్‌నగర్‌తాండా, రహత్‌నగర్‌తాండా, కొత్తతాండా, బాబాపూర్, బాబానగర్ గ్రామాల్లో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, ఎంపీవో జావిద్‌అలీ, డీప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, కాంగ్రెష్ మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు అనంత్‌రావు, నాయకులు కన్నె సురేందర్, వాక మహేష్, కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళంకు దారి తీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలలో అర్హులకు కాకుండా అనార్హుల పేర్లు రావడం పట్ల అధికారులు సర్వేలో ఇచ్చారని ప్రజలు ఆరోపించారు.ఈ సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ప్రజలు శాంతించారు.

జక్రాన్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అరులైన ప్రజలందరికి అందజేస్తామని మాజీఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లి మండలంలోని జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, తొర్లికొండ, బ్రహ్మణ్‌పల్లి, మునిపల్లి గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. మునిపల్లిలో జరిగిన గ్రామసభలో ఎం.సాయిరెడ్డి హాజరై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ పథకాలను అర్హులైన వారందరికి సద్వినియోగం చేసుకోవాలన్నారు.జక్రాన్‌పల్లిలో జరిగిన గ్రామసభలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, గ్రామసభకు హాజరయ్యారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదప్రజల కోసం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలను అర్హులైన వారందరికి ప్రభుత్వం అందిస్తుందన్నారు.ఈ గ్రామసభలో మాజీసర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మండల ప్రత్యేక అధికారి ప్రవీన్, ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంపీవో యసుఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోని దొన్‌పాల్, శెట్‌పల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు.దొన్‌పాల్‌లో ఎంపీవో శ్రీధర్, జీపీ అధికారులు పాల్గొనగా శెట్‌పల్లిలో ఎంపీడీవో తిరుమల, ఇతర మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామసభ సజావుగా జరుగుతున్న సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీఎంపీటీసీ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రసభసచేయాలని చూడడంతో గ్రామానికి చెందిన యువకులు ఆయనపై తిరగబడ్డారు.పదేళ్లపాలనలో ఒకరేషన్‌కార్డు,ఇళ్లుఇవ్వలేదని,ఏముఖంపెట్టుకొని అడుగుతున్నావని నిలదీశారు.

ఫటా..ఫట్...

లిస్టులో పేర్లు లేనివారు ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలి

● దోమకొండ మండల ప్రత్యేకాధికారి జ్యోతి



ప్రభుత్వ పథకాలలో ప్రస్తుతం లిస్టులో పేర్లు రాని అర్హులు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో తమ దరఖాస్తులను సంబంధిత పత్రాలు, పూర్తి వివరాలతో జతచేసి అందజేయాలని దోమకొండ మండల ప్రత్యేక అధికారి జ్యోతి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారిలా...

ఆంధ్రజ్యోతి:ప్రభుత్వ పథాకాలకు సంబంధించి గ్రామ సభలు ఎలా కొనసాగుతున్నాయి?

స్పెషల్ ఆఫీసర్:దోమకొండ మండలంలోని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు పథకాలపై గ్రామ సభలు నడుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి:గ్రామసభలు అన్ని గ్రామాల్లో పూర్తి అయ్యాయి?

స్పెషల్ ఆఫీసర్: మండలంలోని 8 గ్రామాల్లో సభలు పూర్తి అయ్యాయి.21 నుంచి మొదలై 24 వరకు కొనసాగుతున్నాయి. 24 న చివరి గ్రామ సభ దోమకొండతో పూర్తి అవుతుంది.

ఆంధ్రజ్యోతి: పథకాలకు సంబంధించి పేర్లు రాని వారి పరిస్థితి ఏంటీ?

స్పెషల్ ఆఫీసర్: ప్రజలు తమ పేరు రాలేదని ఎలాంటి ఆందోళన చెందవద్దు.ఎంపీడీవో కార్యాలయంలో కౌంటర్ ఉంటుంది. దరఖాస్తు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి:గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాలపై గొడవలు, అధికారుల నిలదీత సంఘటనలు జరుగుతున్నాయా?

స్పెషల్ ఆఫీసర్: ఎక్కడ ఎలాంటి గొడవలు జరుగలేవు. కొన్ని గ్రామాల్లో అర్హులైన వారు తమ పేర్లు ఎందుకు మిస్సయ్యాయని అడుగుతున్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గ్రామ ప్రత్యేక అధికారులు వారిని సముదాయించి అర్థం అయ్యో విధంగా తెలియజేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి:అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులైన నాలుగు ప్రభుత్వ పథాకాలకు సంబంధించి ఎన్ని ఉండవచ్చు?

స్పెషల్ ఆఫీసర్:మండలంలో మొత్తం సర్వే నివేదికను తయారు చేశాం.గ్రామాల్లో ఒక్కోక్క పథకానికి సంబంధించి అర్హులైన లబ్దిదారుల లిస్టు కార్యదర్శుల వద్ద జీపీల్లో ఉంచడం జరిగింది. గ్రామ సభలు పూర్తి కాగానే మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి మొత్తం లబ్దిదారుల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.ప్రస్తుతం లిస్టులో పేర్లు రాని వారి దరఖాస్తులు వస్తున్నాయి. అన్నింటిని అన్‌లైన్ చేసి పూర్తి నివేదికను అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుంది.

● (ఆంధ్రజ్యోతి,దోమకొండ)

శిక్షణ తరగతులకు పేర్ల నమోదు

ఆర్మూర్‌టౌన్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పైడి రాకేష్‌రెడ్డి సహకారంతో హైదరాబాద్ న్యాక్ బృందం ఆధ్వర్యంలో గల్ఫ్‌లో ఉపాధి పొందాలనుకున్న వారికి శిక్షణ తరగతుల నిర్వహణకు గురువారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అన్వర్ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నాణ్యమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు. దీని ద్వారా విదేశాలలో ఉపాధి పొందడానికి సులభతరం అవుతుందని, శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. గల్ఫ్ ఏజెంట్‌లను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. ఇటీవల శిక్షణ పొందిన వారికి గ్రీస్ దేశంలో ఉపాధి నిమిత్తం ఈనెల 25న నిజామాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.


ప్రజాసేవలో ముందుండాలి: మలక్‌పేట ఎమ్మెల్యే


బోధన్‌లో మాట్లాడుతున్న మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి):బోధన్‌లో ఎంఐఎం పార్టీని బలోపేతం చేస్తూ ప్రజాసేవలో ముందుండాలని హైదరాబాద్ మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అయేషా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో 10వ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు సమీ, హబీబ్ ఖాన్, జియా అహ్మద్, చాలం చావుస్, హైమద్ చావుస్, రజా, ఆదిల్, ఏజాజ్‌లతో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం టెన్త్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ క్వశ్చన్ బ్యాంక్ పుస్తకాలను హైదరాబాద్‌లోని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షులు ఫారూఖ్ హైమద్, నిజామాబాద్ డిప్యూటీ మేయర్ ఇద్రీస్ ఖాన్, ఎంఐఎం మండల అధ్యక్షులు అర్షద్ ఖురేషి, అబ్దుల్ ఖదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి


కోటగిరిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ (సీజీఆర్) ప్రోగ్రాం ఇన్‌చార్జి నగేష్ పేర్కొన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సిజీఆర్ ఆధ్వర్యంలో యంగ్ లీడర్స్ ఎర్త్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రావు, జిల్లా ఇంచార్జ్ శంకరయ్య, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బర్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: పర్యావరణాన్ని కాపాడడంతో విద్యార్థులు భాగస్వాములు కావాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రోగ్రామ్ అధికారి పాలడుగు నాగేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఉపాధ్యాయులు విద్యాసాగర్, రాకేష్, ఉపాధ్యాయ బృందంలతో పాటు మామిడి శంకరయ్య, పాల్గొన్నారు.

డయల్ 100కు అత్యవసరమైతేనే ఫోన్ చేయాలి

బోధన్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి: డయల్ 100కు అత్యవసరం అయితేనే ఫోన్ చేయాలని,అకారణంగా ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయవద్దని పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. బోధన్ పట్టణంలోని గోశాలకు చెందిన షేక్ ఫారూక్ అనే వ్యక్తి మద్యంతాగి పలుమార్లు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు గురువారం కోర్టులో హజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించారని ఆయన తెలిపారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు


వర్నిలో నివాళులు అర్పిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

వర్ని,జనవరి23(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో గురువారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల కృష్ణ, సుబ్రమణ్య స్వామి, ప్రవీణ్, రవి, మారుతి, సునీల్, గంగారాం, కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఆజాద్‌హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు దేశస్వాతంత్రంకోసం పోరాడిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను బషీరాబాద్‌లో నవోదయ యూత్ సభ్యులు గురువారం ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. కా ర్యక్రమంలో నవోదయ యూత్ అధ్యక్షుడు ఆకుల నారాయణ, సభ్యులు నేల్ల రమేష్, కుమ్మరి శ్రీనివాస్, ప్వర్గం రమేష్, బాషెట్టి గంగాధర్, శ్రీనివాస్, గణేష్, నేల్ల బుచ్చన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజన్న, గిరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవన్న, గుండోజి రవిందర్, సల్లూరి కిషన్ గౌడ్, రంగాచారి, శ్రీనివాస్ గౌడ్, మహికాంత్, సుమలత, శిరీష, పద్మ,విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువజన సంఘం సభ్యులు సందీప్, సునీల్, గణేష్, ప్రవీణ్, శరత్ తదితరులున్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలోని సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సుభాస్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సామ వెంకట్‌రెడ్డి, నాయకుడు సంతోష్, బద్దం నర్సారెడ్డి, గంగాధర్, మోహీనోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని శ్రీబాషిత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు.ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయిఅబాకస్ పోటీలలో పాఠశాల విద్యార్థులు భూమేష్ చంద్ర,ఆస్రియా,అశ్విని,మిథున్‌రాజ్,రిషిక,సంహిత,శ్రీహన్,దీరాజ్‌లుఅత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ పొలపల్లి సుందర్ తెలిపారు.

డొంకేశ్వర్: అబాకస్ నేర్చుకోవడంతో పిల్లలకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఎస్‌ఎస్‌వీ పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి అన్నారు. డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామంలో ఎస్ఎస్‌వి పాఠశాల విద్యార్థి మేకల దీక్షిత నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. పాఠశాల నుంచి మొదటిసారిగా రాష్ట్రస్థాయికి విద్యార్థి ఎంపిక కావడంతో స్వామి, నరేష్, మౌనిక, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ చిరంజీవి అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


గంజాయి తరలిస్తున్న వారిని రిమాండ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆర్మూర్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి):గంజాయినివిక్రయిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్టు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐస్టీవెన్‌సన్ తెలిపారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇలాఉన్నాయి.ఎక్సైజ్ పోలీసులు రూట్ వాచ్‌మెన్ నిర్వహిస్తున్న క్రమంలో అంకాపూర్ నిజాంసాగర్ కెనాల్‌బ్రిడ్జి సమీపంలో అదే గ్రామానికి చెందిన నూనె శ్రీకాంత్, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన కిరణ్ ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. వీరు ఎండు గంజాయిని అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి ఆర్మూర్ ప్రాంతంలోని చుట్టు పక్కల గ్రామాల్లో చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారన్నారు. వీరిని వచి 1. 6కిలోల ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై చంద్ర మౌళి, ఎక్సైజ్ సిబ్బంది గంగాధర్‌గౌడ్, మోహన్, దేవిదాస్, వికాస్‌గౌడ్, సా యిలు, నరేష్, సందీప్, శ్రీనివాస్, సాగర్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాక్లూర్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాస్‌నగర్ గ్రామం వద్ద గంజాయి విక్రయిస్తున్న శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నిందితుడు నవీపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన వాడు కాగా, గత కొద్ది రోజులుగా నాందేడ్ నుంచి గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారు. గురువారం దాస్‌నగర్ వద్ద అనుమానస్పదంగా పరుగెత్తడంతో అతనిని పట్టుకొని విచారించగా 110గ్రాముల గంజాయి లభించగా దాన్ని సీజ్ చేసి శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'రాజకీయ లబ్ధికోసమే బీఆర్‌ఎస్ నాయకుల తాపత్రయం'


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్,జనవరి23(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికి పథకాలు అందజేయాలన్న ఉద్దేశంతో గ్రామసభలు నిర్వహిస్తుండగా స్థానిక ఎన్నికల్లో రాజకీయ పొంద డానికి బీఆర్‌ఎస్ నాయకులు తాపత్రయ పడుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గురువారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో జరిగిన ప్రశాంతంగా జరుగుతున్న గ్రామసభలో బీఆర్‌ఎస్ నాయ కులు కావాలని అధికారులను నిలదీయడం సరైందికాదన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల ఎంపికలో అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయడం జరిగిందని వారన్నారు. రాబోయే స్థానిక ఎన్ని కల్లో లబ్ధిపొందడం కోసమే బీఆర్‌ఎస్ నాయకులు అర్థరహితంగా ప్రవర్తిం చారని వారు ఆరోపించారు. ఈ సందర్భంలో అధికారుల పథకాల కొనసాగిం పు ప్రక్రియ అని చెబుతూ గ్రామసభను సజావుగా నిర్వహించార న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదేపల్లి జెమ్స్, కుంటకింది శ్రీనివాస్, వినోద్, రంగు శేఖర్‌గౌడ్, గాంధీ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

● ఇద్దరు విద్యార్థులకు గాయాలు ● తప్పిన పెను ప్రమాదం


కమలాపూర్ సమీపంలో బోల్తాపడిన ప్రైవేటు పాఠశాల బస్సు

నవీపేట,జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ సమీపంలో గురువారం ఉదయం ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు బోల్తా పడింది. మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు మండలంలోని నాడాపూర్‌లో 30మంది విద్యార్థులను ఎక్కించుకుని నవీపేటకు వస్తుంది. కమలాపూర్ సమీపంలో పాఠశాల బస్సు అదుపు తప్పి ఎడమ వైపున పొలాల్లోకి తీసుకెళ్లి బోల్తా పడింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనతో కేకలు వేస్తూ ఏడ్చారు. దీంతో సమీపంలో ఉన్న పలువురు స్థానికులు బోల్తాపడి ఉన్న బస్సులోని విద్యార్థులను బయటకు తీశారు. ఇందులో నాడాపూర్‌కు చెందిన మావురం మీనాక్షి అనే 4వ తరగతి విద్యార్థిని, గైని నామని అనే యుకేజీ విద్యార్థినికి గాయాలు కాగా వారికి నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బస్సుప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్‌కు బదులుగా క్లీనర్ భోజన్న బస్సును నడిపినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. దీనికి తోడు ప్రమాదం జరిగిన స్థలంలో కొందరు రోడ్డుకు ఇరువైపులా కబ్జా చేసి తమ పొలంలో కలుపుకోవడంతో ఇరుకుగా మారిందని పలువురు ఆరోపించారు. ఆక్రమణకు గురైన రోడ్డును వెంటనే స్వాధీనం చేసుకుని రోడ్డును వెడల్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్, ఏఎస్ఐ మోహన్ రెడ్డి, ఎంఈవోలు సందర్శించారు.

క్లీనర్‌పై కేసు నమోదు

నవీపేట,జనవరి23(ఆంధ్రజ్యోతి):మండలంలోని కమలాపూర్ సమీపంలో గురువారం ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా పడిన ఘటనలో బస్సు నడిపిన క్లీనర్ శివరాశి పెద్ద భోజన్నపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. నాడాపూర్‌లో విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని నవీపేటకు వస్తుండగా బస్సును డ్రైవర్ శివరాశి భోజన్నకు బదులుగా క్లీనర్ శివరాశి పెద్దభోజన్న నడపడంతో బస్సు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిందని అన్నారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు కాగా అదే బస్సులో ప్రయాణిస్తున్న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు ఉజ్వల ఫిర్యాదు మేరకు క్లీనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

డెంగీ కేసులపై ఆరా తీసిన వైద్య బృందం

భీమ్‌గల్‌రూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేంగల్ గ్రామంలో భారతీయ వైద్య బృందం గురువారం పర్యటించింది. చేంగల్ గ్రామంలో నమోదైన డెంగీ కేసులపై ఆరా తీసి బాధితులను కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. చుట్టు పక్కల చెత్తాచెదరం లేకుండా పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని, మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్‌లకు సూచించారు. బస్తీ దావాఖానాను సందర్శించి రికార్డులను పరిశీలించారు. డెంగీ, వ్యాధి ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని బృందం సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, హరిదత్తు, అజయ్‌పవార్, వసంత్, రాజేందర్, తదితరులు ఉన్నారు.



రోడ్డు భద్రత వారోత్సవాలలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

రోడ్డు ప్రమాదాల నివారణకు
ప్రతీఒక్కరు కృషి చేయాలి

బోధన్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాల గురించి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. ప్రమాదాల నివారణలో ప్రతీ ఒక్కరు నియమ, నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఏకాగ్రతతో బస్సులు నడిపి బస్సులో ఉన్న ప్రజలను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, ఎంవీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● విజయసాయి కళాశాలలో..

బోధన్ పట్టణంలోని విజయసాయి కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సుబ్బారావు, అధ్యాపక బృందం తదితరులున్నారు.



ఆర్మూర్‌లో పంటలపై డ్రోన్ ద్వారా పురుగుల మందును చల్లుతున్న దృశ్యం

తెలుసుకుందాం



పంటపై పురుగుమందును పిచికారీ చేస్తున్న రైతు

పురుగుల మందుల పిచికారీ.. అనారోగ్యంతో సవారీ

• కనీస జాగ్రత్తలు తీసుకోని రైతులు • పొంచి ఉన్న ఆరోగ్య సమస్యలు • పిచికారీకి సబ్సిడీపై డ్రోన్‌లను అందజేస్తే రైతులకు మేలు

ఆర్మూర్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో పంటల సాగులో రసాయానిక మందులు వాడేవారు కాదు. కేవలం సేంద్రీయ ఎరువులపై మాత్రమే ఆధారపడేవారు. పశువుల ఎరువులు, గొర్రెల, మేకల ఎరువు, చెరువులోని మట్టిని వాడి సాంప్రదాయ పద్ధతిలో పంటలు సాగు చేసేవారు. రానురాను పశువుల పెంపకం తగ్గుతూ వచ్చింది. పశువుల ఎరువుల లభించని పరిస్థితులు నెలకొన్నాయి. కాలక్రమేనా సేంద్రీయ ఎరువుల స్థానంలో రసాయన, క్రిమి సంహారక పురుగు మందులు వాడుకలోకి వచ్చాయి. ప్రస్తుతం వ్యవసాయం వ్యాపారంగా మారింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పంటలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో పురుగు మందులపై ఆధారపడి పంటల సాగు ఎక్కువవుతోంది. విత్తన నాటిన మొదలు పంట చేతికి వచ్చే వరకు ఏదో ఒక రసాయన మందులు పిచికారి చేయాల్సిన లేదా వాడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పంటలకు పురుగు మందు పిచికారి చేయడానికి అవగాహన లేకపోవడంతో పలువురు రైతులు అనారోగ్య భారిన పడుతున్నారు. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకుంటే ముప్పు తప్పదు.

పంటలపై పిచికారీ చేయాలి ఇలా

● ఎరువులు, పురుగు మందులను పంటలపై చేసే సమయంలో శరారీనికి తగలకుండా దుస్తులు పూర్తిగా తగిలించాలి. మాస్కు ధరించి కంటి అద్దాలు పెట్టుకోవాలి.

● పిచికారి చేసే సమయంలో రక్షణగా వస్త్రాలను ధరించాలి.

● గాలి దిశలో పిచికారి చేయాలి.

● పురాతన, పాడైన స్ప్రెయిర్‌లను, డస్టర్‌లను వాడవద్దు.

● పిచికారి సమయంలో ఏలాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దు. బీడీ, సిగరేట్ వంటివి తాగకూడదు.

● మందులు పిచికారి చేసేటప్పుడు విష ప్రభావానికి గురైతే పురుగు మందు డబ్బా, దాని కరపత్రం తప్పనిసరిగా వైద్యునికి చూపిస్తే సరైన చికిత్స లభిస్తుంది.

అజాగ్రత్తగా ఉంటే ఆరోగ్యానికి ముప్పు

పంటలో క్రిమి సంహారక మందులు పిచికారి చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకొని పక్షంలో రైతుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. రసాయన గాడతతో చాతి బరువు, కళ్లు తిరగడం, గుండె వేగం తగ్గడం, పిల్లికూతలు, నీరసం, డిప్రషన్ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యునికి సంప్రదించాలి. జాప్యం చేస్తే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. ఇతర క్రిమిసంహరక మందులతో పాటు గడ్డి మందు ప్రమాదకరం. దీనిని పిల్చిన, చర్మనికి తగలడం వల్ల ఊపిరి తిత్తులు గట్టిపడి కిడ్నీలపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గర్భిణులు ఈ క్రిమి సంహారక మందులకు దూరంగా ఉండాలి. లేనిపక్షంలో పుట్టబోయే పిల్లలకు బుద్ధి మందగించడం, బలహీనత వంటివి కనిపిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. మందులు శరీరానికి తగలకుండా పూర్తిస్థాయిలో చేతులకు గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలి.

డ్రోన్ సర్వీస్‌లు అందుబాటులో ..

ప్రస్తుతం క్రిమి సంహారక మందులు పిచికారి చేయడానికి డ్రోన్ సర్వీస్‌లు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని గ్రామాల్లో వీటిని కొనుగోలు చేసిన వారు డ్రోన్‌ల ద్వారా పంటలపై క్రి మిసంహరక మందులను పిచికారీ చేస్తున్నారు.. ఇందుకు రైతులు వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై మహిళా సంఘాలకు అందజేస్తోంది. నేరుగా రైతులకే సబ్సిడీపై డ్రోన్‌లు అందజేస్తే రైతులు లబ్ధిపొందుతారు. అదేవిధంగా డ్రోన్‌ల వినియోగంపై గ్రామాల్లోని యువ రైతులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి సబ్సిడీపై డ్రోన్‌లు అందజేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లను అందజేయాలి

● రోహిత్‌రెడ్డి, రైతు, పిప్రి



పంటల పిచికారికి సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లను ప్రభుత్వం అందజేయాలి. గతంలో ఎకరానికి రూ.800 చెల్లించి కూలీలచే స్ప్రే చేయించే వాళ్లం. ప్రస్తుతం కూలీల కొరత వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం డ్రోన్‌ల ద్వారా ఎకరానికి రూ.600 చెల్లించి స్ప్రే చేయిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్‌లను సబ్సిడీపై రైతులకు అందజేస్తే మరింత సౌకర్యంగా ఉంటుంది.

ప్రైవేటు పాఠశాలల సమస్యలను
ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేద్దాం
● ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు

బోధన్‌రూరల్, జనవరి23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేద్దామని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల ఇందూర్ మోడల్ పాఠశాలలో మెమోంటో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయని వాటి పరిష్కారానికి ట్రస్మా కృషి చేస్తుందని వివరించారు. తల్లిదండ్రుల సేవలో ప్రైవేటు పాఠశాలలన్నీ అన్ని వేళలా ముందుకు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు సేవలు అందించడంలో ముందున్నాయని ఆయన అన్నారు. విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడంతో ప్రైవేటు పాఠశాలల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు దిగంబర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కార్తీక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు మిద్దెల రాజు, గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ, జిల్లా కోశాధికారి హన్మాండ్లు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



ఫరీద్‌పేట్‌లో నూతన గ్రంథాలయ నమూనా



బాధిత కుటుంబాలకు బియ్యం అందిస్తున్న దృశ్యం(ఫైల్)

ఫరీద్‌పేట్‌లో గ్రంథాలయ నిర్మాణం

● హారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు ● అభివృద్ధి పనుల కోసం మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి కృషి

మాచారెడ్డి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది ఉన్నత విద్యావంతులకు నిలయమైన.. ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన గ్రామం పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట్.. ఈ గ్రామానికి చెందిన మాచారెడ్డి తాజా మాజీ వైస్ ఎంపీపీ జీడీపల్లి నర్సింహారెడ్డి తండ్రి, కూతురు హారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతూ కన్న ఊరులో సామాజిక సేవలు అందిస్తున్నారు. విద్యా దానమే మహాదానంగా భావించి గ్రామంలోని విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి, విద్యావంతులకు పోటీ పరీక్షలలో విజ్ఞానం పొందేందుకు గ్రామంలో ఆయన తండ్రి జీడిపల్లి మహబూబ్‌రెడ్డి, కూతురు హారిక జ్ఞాపకార్థం సుమారు రూ.20 లక్షలలో అందమైన ఆహ్లాదకరంగా ఏకాగ్రతగా ఉండేవిధంగా గ్రా మంలో రైతువేదిక పక్కన గ్రంథాలయాన్ని సొంత డబ్బులతో నిర్మిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు 30న అప్పటి కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, అప్పటి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రంథాలయ భవనం వచ్చేనెల ఫిబ్రవరి 2025లో ప్రారంభోత్సవం చేయడానికి పనులు పూర్తిచేయడానికి నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు నరసింహారెడ్డి. గ్రామంలోని పేద కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఆ బాధిత కుటుంబానికి 50కిలోల సన్న బి య్యం, యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తారు. గ్రామంలో తాగు నీటి సమస్యను తీర్చడానికి 5 బోరు బావులను తవ్వించి సింగిల్‌ఫేజ్ మోటార్‌లు పంపిణీ చేశారు. గ్రామంలో దేవాలయాల వద్ద గ్రామంలోని ప్ర ధాన కూడలీల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. పెద్దమ్మ తల్లి ఆలయానికి గ్రానైట్ అందజేశారు. కుమ్మరి కుల సంఘానికి 85 గజాల సొంత స్థలం, గ్రామంలోని పూజారికి ఇంటి నిర్మాణం కోసం 50 గజాల సొంత స్థలం ఇచ్చి అందరి మన్నలను పొందారు. ఇలా గ్రామంలో ఎన్నో సేవలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రంథాలయంలో గ్రానైట్ అందంగా ఫర్నిచర్ పనులు కొనసాగుతున్నారు. కన్న ఊరికే మంచి చేయాలనే ఉద్ధేశంలో సేవలను కొనసాగిస్తూ అభివృద్ధికి తోడ్పడుతూ ముందుకు సాగుతున్నారు. గ్రామంలో గ్రంథాలయం భవనం ఆధునిక పద్ధతులతో అన్ని సౌకర్యాలతో నిర్మిస్తుండడంతో గ్రామప్రజలు నర్సింహారెడ్డిని అభినందిస్తున్నారు. ఇలా మున్ముందు మరెన్నో సేవలు చేయడానికి ముందుకు సాగుతున్నారు.



నిర్మాణంలో ఉన్న గ్రంథాలయం



కామారెడ్డిలో పొగమంచు కమ్ముకున్న దృశ్యం

కామారెడ్డిని కమ్మేసిన పొగమంచు

కామారెడ్డిటౌన్/భిక్కనూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం కామారెడ్డితో పాటు భిక్కనూరులో గురువారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో పాటు చలిగాలులు వీచాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చల్లటి గాలుల ప్రభావంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భిక్కనూరులో దాదాపు 9 గంటల వరకు పొగమంచు కారణంగా ముఖ్యంగా పాఠశాలల బస్సుల డ్రైవర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కున్నారు.



భిక్కనూరులో..





ఫొటో న్యూస్



కాలువంతా మొక్కలే.. నీరు పోయేదెలా..!?

నిజాంసాగర్ కాలువ పిచ్చిమొక్కలు, తీగ జాతి మొక్కలతో నిండిపోయింది. రెండో పంటకు నీటిని వదులుతున్నప్పటికీ పొలాలకు చేరాలంటే ఇబ్బందిగా మారింది. కాలువలో మట్టి ఉండడంతో పిచ్చి మొక్కలు, గొర్రపు డెక్క ఏపుగా పెరిగాయి. డిచ్‌పల్లి నుంచి మెంట్రాజ్‌పల్లి మీదుగా వెళ్లే నిజాంసాగర్ కాలువ దుస్థితి ఇది. ఎక్కడ చూసినా కాలువ అంతా పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. ఈ మొక్కల కారణంగా రైతులకు నీరు పిల్ల కాలువల ద్వారా వెళ్లడం లేదు. పొలాల్లోకి నీరు వెళ్లాలంటే పిచ్చి మొక్కలు అడ్డు వస్తున్నాయి. కాలువంతా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



సిరికొండలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



సారంగాపూర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులు..

మోపాల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని సారం గపూర్ గ్రామంలో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతిని గ్రామ యువకులు ఘనంగా జరుపు కున్నారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత ఆయన మార్గంలో నడుచుకోవాలని పలువురు సూచించారు. ఈ కార్యక్రమంలో యువకులు నగేష్, సుదర్శన్, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, రవి, జుబేర్, సాయిలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్‌చారి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్నశీలా, కిరణ్మయి, ఏబీవీపీ నాయకులు సమీర్, అనిల్, నవీన్, రమణ, నరేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని యువకులు, బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో యువకులు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. గడ్కోల్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని నిర్వహించారు. ఆయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్వర్, సంజీవ్‌రెడ్డి, శంకర్, రామస్వామి, రాజేశ్వర్‌రెడ్డి, భాస్కర్, సిరికొండ యువకులు సంతోష్, గంగాధర్, మారుతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండల కేంద్రంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను యువకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పరిరక్షణ కమిటీ సభ్యులు లోకాని గోపి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరంలో సాయుధ పోరాటం చేసిన యోధుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. నేతాజీ అడుగుజాడల్లో నడుచుకొని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పరిరక్షణ కమిటీ సభ్యులు అశోక్, ప్రసాద్, భాస్కర్, దాసు, ప్రవీణ్, శంకర్, అరుణ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నగరంలో అభివృద్ధి పనుల ప్రారంభం

సుభాష్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు అభివృద్ధి పనులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. నగరం పరిధిలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న 7వ డివిజన్, 24వ డివిజన్‌లోని గాయత్రీనగర్, 26వ డివిజన్‌లోని పెద్దబజార్, 48వ డివిజన్‌లోని కోటగల్లి, 50వ డివిజన్‌లోని పెద్ద బజార్, 28వ డివిజన్‌లోని గాజుల్‌పేటలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రకటించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన 14వ ఫైనాన్స్ నిధుల ద్వారా డివిజన్‌కు రూ.10లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. ప్రజల అవసరాల కోసమే ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నగర అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నగర అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు సుక్కమధు, ఇప్పకాయల సుమిత్ర, కిశోర్, బంటు వైష్ణవి, బట్టు రాఘవేందర్, చెందుపట్ల వనిత, ఇల్లెందుల మమత, బంటు రాము, ఇతర నేతలు హాజరయ్యారు.

బాలికల కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల మైదానంలో మొరం వేయించి మొక్కలు పెంచడంపై ప్రిన్సిపాల్‌ను అభినందించారు. కళాశాలలో మైదానం బురదగుంటగా ఉండేదని విద్యార్థులు ఇబ్బందులు పడేవారని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయమై ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ ఎమ్మెల్యేకు వివరించారు. కళాశాల స్టేజ్ షెడ్డు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఆయన కోరారు. కళాశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 13వ డివిజన్‌లో రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు గురువారం నుడా చైర్మన్ కేశవేణు భూమిపూజ చేశారు. అనంతరం 12, 34వ డివిజన్‌లలో నిర్వహిస్తున్న వార్డు సభలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించాలనే ఆలోచనతో వార్డు సభలను నిర్వహిస్తుందని అర్హులైన పేదవారందరూ తమ పేర్లు అర్హుల జాబితాలో లేకుంటే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ భరోసా పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే అందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, కార్పొరేటర్ అరుణ్, డిప్యూటీ మేయర్ ఫయీం, అబుద్‌బిన్ హందాన్, తదితరులు ఉన్నారు.

దొంగతనాల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి

ఖిల్లా,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల జరుగుతున్న దొంగతనాలను నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వస్త్రభవన్‌లో గురువారం వస్త్రవ్యాపారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. రాత్రివేళలో దుకాణాలకు కాపలగా ఉండే విధంగా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. దుకాణాల సముదాయాల ఎదుట సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకుని అవి 24గంటలు పని చేసే విధంగా పరిశీలించుకోవాలన్నారు. హై సెక్యూరిటీ లాక్‌లను వినియోగించుకోవాలన్నారు. వ్యాపారాలు ముగిసిన అనంతరం విలువైన బంగారం, నగదును సేఫ్ లాక్‌లో భద్ర పర్చురేవాలన్నారు. నగదు లావాదేవిలకు బదులు డిజిటల్ లావదేవీలు నిర్వహించాలన్నారు. దుకాణాల్లో అలారం విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఏ విధంగా నడుచుకోవాలో పని వాళ్లకు ముందే వివరించాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి,వస్త్రవ్యాపారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సుభాష్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్‌లోని జర్నలిస్ట్ లక్ష్మీనారాయణ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త గురువారం పరామర్శించారు. నగరం పరిధిలోని సీనియర్ నాయకులతో కలిసి ఆయన ఈ పరామర్శలో పాల్గొన్నారు. నగరంలోని 25వ డివిజన్ కార్పొరేటర్ ధర్మపురి తల్లి చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

ఘనంగా భారత రాజ్యాంగ సంవిధాన్

సిరికొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ నాయకులు భారత రాజ్యాంగ సంవిధాన్ గౌరవ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగం గురించి ప్రజలకు వివరించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి నక్కరాజేశ్వర్ అన్నారు. మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రామస్వామి, డాక్టర్ శ్రీనివాస్, శంకర్, కొండయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మందుల వివరాలు అడిగితెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో

శస్త్రచికిత్స శిబిరాన్ని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో

మోర్తాడ్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం పురుషుల శస్త్రచికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 12మందికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేశారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో సరిపోయేంత మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రమేష్, డాక్టర్ రవీందర్, క్యాంప్ ఆఫీసర్ ప్రవీన్‌కుమార్, డాక్టర్ వివేక్, హెచ్‌ఈవో సాయన్న, ఫార్మసిస్టు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఖిల్లా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సరైన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను వినియోగదారుల మండలి సభ్యులు విజ్ఞప్తి చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావును గురువారం కలిసి రోడ్డు ప్రమాదాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేషనల్ హైవే పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల వల్ల ఎక్కువ మంది చనిపోతున్నారని టోల్‌ప్లాజా వద్ద ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేస్తే గోల్డెన్ హవర్‌లో చికిత్స అందుతుందని వారు తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్‌లలో ట్రామా సెంటర్‌లు లేకపోవడం వల్ల ఎక్కువ మంది చనిపోతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్‌రావు, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, అనీల్‌కుమార్, ప్రవీణ్, వర్మ పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర సభలను జయప్రదం చేయాలి

ఖిల్లా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో శుక్రవారం నుంచి జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సభలకు సీపీఎం జాతీయ నాయకులు బృందాకారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీనియర్ నేత ఎస్.వీరయ్యతో పాటు ఇతర నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభల్లో పలు అంశాలపై చర్చిస్తారని వారు తెలిపారు. పోస్టర్ రిలీజ్ చేసిన వారిలో కటారి రాములు, నర్సయ్య, అనసూయమ్మ, నరేష్, ఉద్దవ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

ధర్పల్లి హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విజయ

ధర్పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ధర్పల్లి జడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్‌గా అదే పాఠశాలకు చెందిన విజయను నియమించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన గణజ్యోతిపై సస్పెషన్ వేటు పడటంతో ఉపాధ్యాయురాలు విజయను ఇన్‌చార్జి హెచ్‌ఎంగా నియమించినట్లు తెలిసింది. కాగా, గణజ్యోతి విధుల పట్ల నిర్లక్ష్యంతో పాటు మధ్యాహ్న భోజనం విషయంలో అక్రమాలకు పాల్పడటంతో ఈమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి విచారణ అనంతరం ఆమెను సస్పెండ్ చేశారు.

డెంగీ వ్యాప్తిపై కేంద్ర బృందం పర్యటన

ధర్పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో డెంగీ ప్రబలడంపై కేంద్ర వైద్య బృందం గురువారం మండల కేంద్రంలో పర్యటించింది. 2024 నుంచి ఇప్పటి వరకు 720 డెంగీ కేసులు నమోదైనట్లు కేంద్ర బృందం సైంటిఫిక్ అధికారి పి.శ్రీనివాస్ తెలిపారు. సిరికొండ పీహెచ్‌సీ పరిధిలో 36 కేసులు నమోదు అయ్యాయని ఇందులో ధర్పల్లి సబ్‌సెంటర్ పరిధిలో రెండు కేసులు నమోదు అయ్యాయని అన్నారు. డెంగ్యూ రావడానికి గల కారణాలను ఆయన ధర్పల్లి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గల 30 ఇళ్లను కేంద్ర బృందం సందర్శించి పరిశీలించింది. సంప్‌లు, టైర్లు, కంటేనర్, ఉపయోగంలో లేని వస్తువులలో నీటి నిల్వను వారు గుర్తించి పారబోశారు. పది ఇళ్లలో నిల్వ ఉంచిన నీటిలో లార్వా ఉన్నట్లు గుర్తించారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రతీ శుక్రవారం గ్రామాల్లో పర్యటించి ఫ్రైడే డ్రైడేను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ హరిదత్తు, సబ్ యూనిట్ అధికారి రాజేందర్, భూలక్ష్మి, భార్గవి, సుప్రజ, సిబ్బంది ఉన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి

సిరికొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మలేరియా, డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించాలని టెక్నికల్ అసిస్టెంట్ హరిదత్తు వైద్య సిబ్బందిని కోరారు. సిరికొండ మండలం మైలారం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి గ్రామానికి సందర్శించారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూ పాజిటీవ్ కేసులపై పరిశీలన చేశారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని డెంగ్యూ వ్యాధి సంక్రమింపజేసే దోమ మంచినీటిలో మాత్రమే తిరుగుతుందని కావున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్వింద్, సూపర్‌వైజర్ నిర్మల, స్వరూప, రాజేందర్, రమేష్ ఉన్నారు.

'గాడ్' సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్

మోపాల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఎస్‌ఆర్‌ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం రాత్రి గాడ్ సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన విరాజ్ రెడ్డి కథానాయకుడిగా నటించిన గాడ్ సినిమాను ఇక్కడ ఆడియో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నూడా చైర్మన్ కేశవేణు, ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా బృందం ఆటాపాటలతో అందరిని ఆకట్టుకున్నారు.

సీనియర్ న్యాయవాది మృతి

● సంతాపం తెలిపిన బార్ అసోసియేషన్

నిజామాబాద్ లీగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పొద్దుటూరి సదానంద్‌రెడ్డి గురువారం మృతి చెందారు. ఆర్మూర్ మండలం ఇస్సపల్లి గ్రామానికి చెందిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లా పట్టాభద్రులై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని నిజామాబాద్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా 50 ఏళ్లకు పైగా ప్రాక్టీస్ చేశారు. ఆయన మృతికి సంతాపకంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కిరణ్‌కుమార్‌గౌడ్, తుల గంగాధర్, ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి సురేష్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న యోగితారాణా

గురుకులాలను సందర్శించిన యోగితారాణా

డిచ్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను గురువారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కమిషనర్ యోగితారాణా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని యోగితారాణా తెలిపారు.

సాంఘిక సంక్షేమ కళాశాల సందర్శన..

సాంఘిక సంక్షేమ ఇతర గురుకుల వసతి గృహాలల్లో విద్యార్థులకు సమకూర్చే భోజనంలో నాణ్యతను విస్మరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి యోగితారాణా హెచ్చరించారు. ధర్మారం గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల, పాఠశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్, జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చిన్నయ్య, ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్యలు పేద విద్యార్థులకు కోసం నైట్ పుస్తకాలను విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి యోగితారాణాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా అధికారి అశోక్, ఎంఈవో, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 2021లో 317 జీవో ద్వారా ఉపాధ్యాయ దంపతులను వేరువేరు జిల్లాలకు బదిలీ చేయగా గత మూడేళ్లుగా భార్య ఒక జిల్లాలో భర్త ఒక జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఎంతో ఆవేదన చెందామని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పౌజ్ బదిలీలను చేపడుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల గురువారం స్పౌజ్ ఉపాధ్యాయులు జిల్లా కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్ బదిలీల పరిష్కారానికి మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ రిపోర్టు ఆధారంగా జీవో నంబర్ 243 ద్వారా వేరువేరు జిల్లాలో పనిచేస్తున్న భార్య భర్తలను ఒకే జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విద్యాశాఖలో 834 స్పౌజ్ బదిలీలు కాగా నిజామాబాద్ జిల్లాకు 57 మంది ఉపాధ్యాయులు వచ్చారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు స్పౌజ్ ఫోరం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. వివిధ కారణాలతో మిగిలి పోయిన అప్‌గ్రేడేషన్ అయిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లు, ఇంటర్ డిస్ట్రిక్, సెంట్రల్ స్పౌజ్‌లో ఉన్న వారిని కూడా త్వరగా బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, బాల్‌రాజు, సుమన్, రాజేశ్వరి, సౌజన్య, భారతి, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న ఖమ్మంలో జరిగే రెండు పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ విలీన సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్, రాజేశ్వర్‌లు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఉస్మానియా యూనివర్సిటీలో పురుడుపోసుకొని నేడు దేశవ్యాప్తంగా పీడిత విద్యార్థి పక్షాన పోరాడుతుందన్నారు. 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాట వారసత్వం పీడీఎస్‌యూ సొంతం అన్నారు. నిన్నటివరకు విడివిడిగా కొనసాగిన రెండు పీడీఎస్‌యూ సంస్థలు నేడు ఐక్యమవ్వడాన్ని ప్రగతిశీల విద్యార్థి అభిమానులు, విద్యావేత్తలు, మేధావులు హర్షిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ఖిల్లా,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన ఆరవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అర్సపల్లి బైపాస్ సమీపంలో గురువారం జరిగింది. ఆరవ టౌన్ ఎస్ఐ వెంకట్రావ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అర్సపల్లికి చెందిన రైతు తరికంటి యాదయ్య (78) తన వ్యవసాయ పనులు ముగించుకుని టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలయిన యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య తరికంటి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు.

నల్లవెల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇందల్వాయి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు రూ.లక్షా 69వేల 500 చెక్కులను నల్లవెల్లి సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి గురువారం అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు ఎంతో ఆసరగా ఉంటుందని ఆయన అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరు చేసిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, ఎడ్ల శ్రీనివాస్, ఎంపీ గంగన్న పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఖిల్లా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డికి ఐఎఫ్టియు నగర కమిటీ ప్రతినిధులు విన్నవించారు. గురువారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రంతో పాటు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ.. గతంలో కూరగాయల మార్కెట్‌లో అనేక సమస్యలు ఉండేవన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మార్కెట్‌లో ముప్ప గంగారెడ్డి కొన్ని సమస్యలు పరిష్కరించాడని తెలిపారు. ప్రస్తుతం కూరగాయాల మార్కెట్‌లో తీవ్రమైన దోమల బెడద, ఆటో పార్కింగ్‌కు స్థలం, స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ఆటోయూనియన్ వర్కర్స్, హమాలీ వర్కర్స్ యూనియన్, రిక్షా పుల్లర్స్ స్ట్రీట్ వెండర్స్ యూనియన్ సభ్యులు ఇమ్రాన్, సురేష్, వకీల్, గంగాధర్ మల్లేష్‌లు తదితరులు ఉన్నారు.

బడారాంమందిర్ గోశాలలో అగ్నిప్రమాదం

ఖిల్లా,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి వద్ద గల బడారాం మందిర్‌లో గల గోశాలలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. పక్కనే ఆవుల కోసం నిలువ ఉంచిన గడ్డివాము అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. వెంటనే స్పందించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక శాఖాధికారులకు సైతం సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. దీంతో మంటలు వ్యాప్తి చెందలేదు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.82000	రూ.75650	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్ర్కీన్-2 : స్కై ఫోర్స్ (హిందీ) (10.50, 1.35, 7.25, 10.10)
: డాకు మహారాజ్ (4.20)
స్ర్కీన్-3 : తల్లి మనస్సు (11.05)
: గాంధీతాత చెట్టు (2.10, 8.00)
: గేమ్ చేంజర్ (4.40) : హత్య (10.30)
స్ర్కీన్-4 : డియర్ కృష్ణ (11.00)
: ఐడెంటిటి (1.45)
: హాంకాంగ్ వారియర్స్ (5.00)
: డాకు మహారాజ్ (7.20)
: పుష్ప-2 (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.30, 4.30, 7.20, 10.00)
స్ర్కీన్-2 : ఐడెంటిటి (10.40)
: డాకు మహారాజ్ (4.30, 10.20)
: గేమ్ చేంజర్ (7.20)
స్ర్కీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (11.00, 1.35, 7.30, 10.30)

దేవి: డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్